క్లుప్తంగా

ఆకట్టుకున్న బాలసభ



బాలసభలో విద్యార్థులు

ఆమనగల్లు: బాలుర ఉన్నత పాఠశాలలో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలసభ ఆకట్టుకుంది. పట్టణంలోని పాఠశాలలో ప్రతి శనివారం సభ చేపడుతున్నారు. ఇందులో విద్యార్థులే డీఈఓ, ఎంఈఓగా వ్యవహరిస్తూ సభను కొనసాగిస్తారు. కథలు చెప్పడం, పాటలు పాడటం, పొడుపు కథలు వేయడం, నృత్యాలు చేయడం లాంటివి చేస్తారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు పాండు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణయ్య, మాధవి, సుజాత, జ్యోతి, మాలతి, వనిత, కుసుమలత, మేరి, నీలిమ, పద్మ, రమాదేవి, వందేమాతరం ఫౌండేషన్ వలంటీర్లు కవిత, శ్యామల పాల్గొన్నారు.

ఓటింగ్ విధానంపై అవగాహన అవసరం



ఎన్నికల అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు

కడ్తాల్: ఎన్నికలు, ఓటింగ్ విధానంపై విద్యార్థులకు అవగాహన అవసరమని కృష్ణవేణి పాఠశాల ప్రిన్సిపాల్ ఈర్లపల్లి రవి అన్నారు. శనివారం పాఠశాలలో స్కూల్ ఎన్నికలు నిర్వహించారు. ఇందులో పాఠశాల అధ్యక్షురాలిగా చందనశ్రీ, ఉపాధ్యక్షుడిగా మాన్సీ, ప్రధాన కార్యదర్శిగా చరణ్, సాంస్కృతిక కళల నిర్వాహక కార్యదర్శిగా మీనాక్షి తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం 2023–24 విద్యా సంవత్సరం పది పరీక్ష ఫలితాల్లో కార్తీక్ 10 జీపీఏ సాధించారు. ఈ సందర్భంగా కార్తీక్‌తో పాటు, అతని తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. పై చదువుల కోసం రూ.10 వేలు సాయం అందజేసింది. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దిలీప్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

బోనాలకు విరాళం



ఆలయ కమిటీకి చెక్కు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: పోచమ్మ బోనాల ఉత్సవాలకు ఎంపీటీసీల సంఘం జిల్లా మాజీ గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి రూ.51 వేల(చెక్కు)ను శనివారం పోచమ్మ ఆలయం వద్ద ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బోనాల పండుగను భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు సత్యం యాదవ్, రాములు, మల్లేశ్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్, నాయకులు గూడూరు భాస్కర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, జహంగీర్‌అలీ, యాదయ్య, పాండు, మల్లయ్య, రాజేశ్, భానుకిరణ్, శ్రీకాంత్, శ్రీను, శేఖర్, చందు, మహేశ్, గణేశ్, రాజు తదితరులు ఉన్నారు.

30న ఆలయ భూముల కౌలుకు వేలం

ఇబ్రహీంపట్నం: రాయపోల్ గ్రామం వేణుగోపాలస్వామి దేవాలయానికి చెందిన భూములను కౌలుకు ఇచ్చేందుకు ఈ నెల 30న వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు వేలం చేపట్టనున్నామని పేర్కొన్నారు. 1 సెప్టెంబర్ 2024 నుంచి 31 ఆగస్టు 2025 వరకు భూములను కౌలుకు ఇస్తామని, ఆసక్తి గలవారు పాటలో పాల్గొనాలని వెల్లడించారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

మహేశ్వరం: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు బైపాస్ రోడ్డు నిర్మిస్తామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన బైపాస్ రోడ్డు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడారు. మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి బైపాస్ రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు, మండల వాసులు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. రోడ్డు నిర్మాణానికి రైతులతో మాట్లాడి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రోడ్డు నిర్మించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. శివగంగ రాజరాజేశ్వర ఆలయం, దర్గాతో రోడ్డు విస్తరణకు అడ్డంకులు ఏర్పడ్డాయని స్థానికులు కేఎల్లార్ దృష్టికి తీసుకెళ్లారు. మహేశ్వరం దినదినాభివృద్ధి చెందుతుండడంతో బైపాస్ రోడ్డు నిర్మించడం తప్పనిసరని వెల్లడించారు.

ఓపీ నిలిపి.. నిరసన బాట

- వైద్యురాలి హత్యోదంతంపై వైద్యుల ఆందోళన
- నిందితులను శిక్షించాలంటూ డిమాండ్
- వైద్యసేవలు అందక రోగుల ఇబ్బంది



ఆమనగల్లులో.. వైద్యసిబ్బంది ర్యాలీ

ఇబ్రహీంపట్నం: కోల్‌కతాలో ఇటీవల యువ వైద్యురాలిని లైంగికంగా వేధించి హతమార్చిన సంఘటన దేశవ్యాప్తంగా ఆందోళనకు దారి తీసింది. ఇందులో భాగంగా శనివారం జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల వైద్య సిబ్బంది ఓపీ సేవలను నిలిపివేసి, నిరసన బాటపట్టారు. ఇబ్రహీంపట్నంలో నిందితులను కఠినంగా శిక్షించాలంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డులు చేతబట్టి నిరసన వ్యక్తంచేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు జవహర్‌లాల్, కీర్తన, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉరి తీయాలి

ట్రైనీ వైద్యురాలిని హతమార్చిన దుండగులను ఉరి తీయాలని లిమ్స్ ఆస్పత్రి ఎండీ, డాక్టర్ విశ్వనాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు లిమ్స్ వైద్య సిబ్బంది కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడారు. హత్య ఘటనలో నిందితులు ఎంతటి వారైనా సరే కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజర్ బాషా, వైద్య సిబ్బంది శశికాంత్, శివశంకర్, సతీష్‌నాయక్, ఖాదర్, రమేష్, సరోజ పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: వైద్యురాలిని పాశవికంగా హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ నరేందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల డాక్టర్లు, ఆశ కార్యకర్తలు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు సంయుక్తంగా భారీగా ర్యాలీ తీశారు.



ఇబ్రహీంపట్నంలో..

జాతీయ రహదారి రాజీవ్ కూడలిలో మానవహారం నిర్వహించారు.

తెరుచుకోని ఓపీ విభాగం



రోగులకు మందులు ఇస్తున్న నర్సులు

పట్నంలోని సర్కారు దవాఖాన ఔట్ పేషెంట్స్ విభాగం తలుపులు తెరుచుకోలేదు. దీంతో వైద్యం కోసం వచ్చిన రోగులు తిరిగి వెళ్లిపోయారు. అత్యవసరం ఉన్న రోగులకు నర్సులు మందులు పంపిణీ చేశారు.

కళ్లు తిరిగినట్లు అయితే..



కళ్లు తిరిగినట్లుగా ఉంటే వైద్యం చేయించుకునేందుకు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాను. ఓపీ విభాగం తీయలేదు. దీంతో ఆర్ఎంపీ వైద్యుడి వద్ద బీపీ చెక్ చేయించుకొని, మందులు తీసుకున్నాను.

– బుచ్చప్ప, ఇబ్రహీంపట్నం

సుస్తిగా ఉందని..



సుస్తిగా ఉందని ఆస్పత్రికి వెళ్లాను. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బంది పడ్డాను. ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకొని మందులు తీసుకున్నాను.

– సోమమ్మ, ఇబ్రహీంపట్నం

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్



చెక్కు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: దేశంలో ఎక్కడా లేని విధంగా పేద, మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య పరిరక్షణకు సీఎంఆర్ఎఫ్ అండగా ఉందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామానికి చెందిన పుల్యానాయక్ అనారోగ్యానికి గురికాగా.. శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద రూ.57 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన.. బాధితుడు పుల్యానాయక్‌కు సహాయనిధి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అరవింద్‌నాయక్, సుమన్‌నాయక్, గోపినాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కడ్తాల్: మండల పరిధి పల్లెచెలకతండాకు చెందిన వడ్త్యావత్ లలితకు సీఎం సహాయ నిధి నుంచి రూ.20 వేలు మంజూరయ్యాయి. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులకు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లోకేశ్, నాయకులు సాయిలు, పాండు, రాజునాయక్, శ్రీను, చందు, బీక్యా, నరేశ్, భీమన్, బాలేందర్, యాదగిరి తదితరులు ఉన్నారు.

ట్యాంక్‌బండ్‌పై పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలి

ఆమనగల్లు: హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై బహుజన విప్లవవీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని పాపన్నగౌడ్ యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 18 నుంచి 31 వరకు సర్దార్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు.

ఎంపఓగా శ్రీనివాస్‌గౌడ్



ఆమనగల్లు: మండల వ్యవసాయ అధికారిగా శ్రీనివాస్‌గౌడ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన అరుణకుమారి మాడ్గుల మండలానికి బదిలీ కాగా.. నల్గొండ జిల్లా మేల్లచెరువులో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌గౌడ్ ఇక్కడికి వచ్చారు. అనంతరం ఎంపఓను.. ఏఈఓలు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. కాగా గతంలో ఆమనగల్లు మండలంలో పనిచేసి మేల్లచెరువుకు బదిలీపై వెళ్లిన శ్రీనివాస్ తిరిగి ఇక్కడికే వచ్చారు.

సొంత డబ్బుతో రోడ్డుకు మరమ్మతు



రోడ్డును చదును చేయిస్తున్న నాయకులు

తలకొండపల్లి: గుంతల మయం అయిన రోడ్డును.. ఓ వ్యక్తి సొంత డబ్బులు వెచ్చించి మరమ్మతు చేయించి సేవాగుణం చాటుకున్నాడు. మండల పరిధి చంద్రధన రహదారి గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. తలకొండపల్లి–మిడ్జిల్ ప్రధాన రహదారి కావడంతో నిత్యం అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గుంతల రోడ్డుతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దీనిని గుర్తించిన కాంగ్రెస్ నాయకుడు రాజెందర్‌రెడ్డి.. సొంత డబ్బులు వెచ్చించి గుంతల్లో మొరం పోయించి రోడ్డును చదును చేయించారు. దీంతో స్థానికులు ఆయన్ను అభినందించారు. కార్యక్రమంలో శంకర్‌రెడ్డి, రాఘవేందర్, రాములు, సుధాకర్‌రెడ్డి, పెంటారెడ్డి, రవీందర్‌రెడ్డి, కర్ణాకరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపఓ రాజు బదిలీ



తలకొండపల్లి: మండల వ్యవసాయ అధికారి రాజు నాగర్‌కర్నూల్ మండలానికి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో హైదరాబాద్ రాంజేంద్రనగర్ విత్తన పరీక్ష కేంద్రంలో పనిచేస్తున్న రేణుక త్వరలో తలకొండపల్లికి రానున్నారని సంబంధిత శాఖ అధికారులు తెలిపారు. కాగా.. 9 సంవత్సరాలుగా రాజు అంకితభావంతో విధులు నిర్వహించి రైతుల సమస్యలకు పరిష్కారం చూపెట్టారు. వారి మన్ననలు అందుకున్నారు.

యాచారంలో.. సందీప్‌కుమార్

యాచారం: మండల వ్యవసాయ అధికారి సందీప్ కుమార్ బదిలీపై రాజేంద్రనగర్‌లోని పురుగు మందుల పరీక్ష కేంద్రానికి వెళ్లారు. ఆయన స్థానంలో కందుకూర్ ఎంపఓ రేగోటి రవీనాథ్ రానున్నారు. సందీప్‌కుమార్ 11 ఏళ్లుగా పనిచేసి మండల ప్రజల మన్ననలు పొందారు.

అలరిస్తున్న నాటికలు

వనస్థలిపురం: తెలంగాణ రాష్ట్ర రంగస్థల కళాకారుల అభిమాన సమాఖ్య ఆధ్వర్యంలో వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీలోని చంద్రకళా వేదికపై నిర్వహిస్తున్న నవమ ఆహ్వాన పౌరాణిక పద్యనాటిక పోటీలు అలరిస్తున్నాయి. రెండో రోజు శుక్రవారం రాత్రి పటాన్‌చెరుకు చెందిన టీబీఆర్ ఆర్ట్స్ వారు స్వామి అయ్యప్ప, జడ్చర్లకు చెందిన నవజ్యోతి కళామండలి వారు మైరావణ నాటికలను ప్రదర్శించి మైమరిపించారు. కార్యక్రమంలో సమాఖ్య కన్వీనర్ వి.వి.సుబ్బారావు, అధ్యక్షులు పంపన వెంకటేశ్వర్ రావు, బాబూరావు, సోమయాజులు, అచ్యుత రామయ్య, సూర్యనారాయణ పాల్గొన్నారు.

రహదారికి మోక్షం



సీసీ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న ప్రజా ప్రతినిధులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి గ్రామం పాఠశాల చౌరస్తా నుంచి మున్సిపాలిటీ కార్యాలయానికి వెళ్లే రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. రూ.16 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులు.. ఇప్పటికే పాఠశాల రోడ్డు నుంచి మసీద్ వరకు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా శనివారం కౌన్సిలర్ బుడుమాల యాదగిరి, బీఆర్ఎస్ నాయకులు షేక్ అఫ్జల్, సయీద్ పటేల్‌లు కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. డ్రైనేజీ పైప్‌లైన్లు వేసి సుదీర్ఘ కాలం వదిలేయడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడేవారని చెప్పారు. ఇదే విషయమై.. పలుమార్లు దిన పత్రికల్లో వార్త కథనం ప్రచురితం అయిందని పేర్కొన్నారు. ఎట్టకేలకు అధికారులు స్పందించి, రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు.

చెరువులను పరిరక్షించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

హయత్‌నగర్: కొందరు అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో చేతులు కలపడంతో చెరువులు, కాలువలు ఆక్రమణకు గురవుతున్నాయని సీపీఎం నాయకులు ఆరోపించారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం తహసీల్దార్ రవీందర్ దత్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తట్టిఅన్నారంలోని సర్వే నంబర్1లో తట్టిఖానా చెరువును కొందరు క్రమంగా పూడ్చివేస్తున్నారని, ఇదే విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని తెలిపారు. ఇదే గ్రామంలోని ఊర చెరువులో నీరు నిల్వకుండా చేసి, చెరువు ఉనికి లేకుండా చేయాలని చూస్తున్నారని చెప్పారు. ఇక్కడే గాలకుంట చెరువును పూడ్చి వేసి విల్లాల నిర్మాణం చేపడుతున్నారని, పక్కనే ఉన్న జంగారెడ్డి కుంటను పూడ్చి రోడ్డు నిర్మించినా ఎవరూ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. అధికారుల చేతి వాటంతోనే రియల్టర్లు కబ్జాలకు పాల్పడుతున్నారని వెల్లడించారు. ఉన్నతాధికారులు స్పందించి చెరువుల ఆక్రమణదారులు, వారికి సహకరిస్తున్న వారిపై తగిన చర్యలు కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహ, ముత్యాలు, గుండె నర్సింహ, మేడిపల్లి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే ప్రత్యక్ష దైవాలు



ఉపాధ్యాయులకు సౌండ్ బాక్సులు అందజేస్తున్న కృష్ణ

ఇబ్రహీంపట్నం: దేవాలయం లాంటి పాఠశాలలో ఉపాధ్యాయులే ప్రత్యక్ష దైవాలని పూర్వ విద్యార్థి, న్యాయవాది కృష్ణ అన్నారు. ఆయన చదువుకున్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు శనివారం సౌండ్ సిస్టమ్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడారు. గురుకులంలో 2005లో పదో తరగతి పూర్తి చేసినట్లు తెలిపారు. న్యాయవాదిగా ఎదగడానికి జన్మనిచ్చిన తల్లిదండ్రులు, విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులే ప్రధాన కారణమని పేర్కొన్నారు. చదువుకున్న పాఠశాలకు అండగా ఉండి తనవంతుగా కొంతైనా సహాయపడాలనే ఈ సౌండ్ సిస్టిమ్(బాక్స్)లను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మెర్సీ వరూధిని, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ అధ్యాపకులు కనకయ్య, శ్రీనివాస్, హుస్సేన్, కిషోర్, వెంకన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి కృషి

యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు రాఘవేందర్‌రెడ్డి



విద్యార్థులతో రాఘవేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు బూడిద రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధి కప్పపహాడ్ గ్రామంలో శనివారం 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు 80 మంది విద్యార్థులకు రూ.90 వేలను వెచ్చించి, క్రీడా దుస్తులు, షూలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సర్కారు బడులను కొనసాగించి, విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని చెప్పారు. ఇందుకు దాతల సహకారం తప్పనిసరని, వారు ముందుకు రావాలని కోరారు. టీచర్లు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని, ప్రయోజకులు కావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సతీష్‌గౌడ్, లక్ష్మారెడ్డి, బాల్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, నర్సింహ, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ బూడిద మంజుల, ప్రభుదాస్, నరేష్, అశోక్, యాదయ్య, శైలం, శ్రీకాంత్, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెల్జాల్‌లో ప్రత్యేక వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు సైదమ్మ

తలకొండపల్లి: మండల పరిధి వెల్జాల్‌లో శనివారం వైద్యాధికారులు ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 50 మంది రోగులకు డాక్టర్ సైదమ్మ ఫీవర్, బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అంటు వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఈఓ ఆంజనేయులు, హెచ్ఏ మల్లయ్య, ఎఎన్ఎంలు సుజాత, సువర్ణ, కార్యదర్శి శరత్, ఆశ కార్యకర్తలు కవిత, సరస్వతి, శారద, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ‘సూర్యగిరి’ ముస్తాబు

రేపటి నుంచి మూడురోజుల పాటు వార్షికోత్సవాలు

- ఆలయంలో కొనసాగుతున్న పనులు
- భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు



ఎల్లమ్మ అమ్మవారు



సూర్యగిరి ఎల్లమ్మ ఆలయం

తుక్కుగూడ: జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయం వార్షికోత్సవాలకు ముస్తాబైంది. వేడుకలను పురస్కరించుకొని ఆలయ కమిటీ సభ్యులు ఆలయానికి రంగులు వేశారు. తదితర ఏర్పాట్లను ముమ్మరం చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

కార్యక్రమాల వివరాలు..

ఈ నెల19 నుంచి 21వ తేదీ వరకు 41వ వార్షికోత్సవాల సందర్భంగా ఘటం ఊరేగింపు, బోనాలు, కల్యాణం, అగ్నిగుండాలు తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ ఉత్సవాలకు జిల్లాతో పాటు, హైదరాబాద్ మహానగరం, నల్గొండ, మహబూబ్‌నగర్ నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. ప్రతి ఏడాది శ్రావణమాసం మూడో సోమవారం ఉత్సవాలు ప్రారంభమై బుధవారంతో ముగిస్తాయి.

ఏర్పాట్లు ముమ్మరం

ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయానికి రంగులు వేయడం, ప్రాంగణంలో పచ్చని చలువ పందిళ్లను ఏర్పాటు చేస్తున్నారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు క్యూలో ఉండటానికి క్యూ లైన్లు బిగిస్తున్నారు. వాహనాల పార్కింగ్‌కు ఆలయ సమీపంలోని భూములను చదును చేస్తున్నారు. రావిర్యాల నుంచి ఆలయం వరకు రోడ్లను శుభ్రం చేయిస్తున్నారు. వచ్చే భక్తులకు తాగునీటి వసతి, తదితర వసతులను కల్పిస్తున్నారు. ఏడాదికి ఒకసారి జరిగే బోనాల ఉత్సవాలు కనుల పండవగా అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.

ఉత్సవాలకు ఆహ్వానం..

మున్సిపాలిటీ పరిధి రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్ఆర్‌తో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా పలు రాజకీయ పార్టీల నాయకులు, వివిధ శాఖల అధికారులకు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

విజయవంతం చేయాలి

ఆలయ వార్షికోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. రేపటి నుంచి మూడురోజుల పాటు వేడుకలు జరగనున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలి.

– రెడ్డిగళ్ల రత్నం, ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్